క్లుప్తంగా

జాబ్ మేళాకు విశేష స్పందన



జాబ్‌మేళాలో ఎంపికైన అభ్యర్థులు

పార్వతీపురంటౌన్: పట్టణంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో శుక్రవారం నిర్వహించిన జాబ్‌మేళాకు విశేష స్పందన లభించిందని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి కె. సాయి కృష్ణ చైతన్య తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 374 మంది అభ్యర్థులు ఇంటర్వ్యూకు హాజరుకాగా 102 మంది ఎంపికై నట్లు తెలిపారు. యువతకు ఉపాధి కల్పనలో భాగంగా జిల్లా వ్యాప్తంగా జాబ్‌మేళాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే బోనెల విజయచంద్ర, కళాశాల కరెస్పాండెంట్ బొంతు శ్రీనివాసరావు, భాస్కర్ విద్యాసంస్థల చైర్మన్ చుక్క భాస్కరరావు తదితరులు పాల్గొన్నారు.

‘ఈత’రం చిన్నారుల ఉల్లాసం..!



ఈత కొట్టేందుకు నేలబావిలో దూకుతున్న చిన్నారులు

పార్వతీపురం రూరల్: వేసవిఎద్దడితో మండుతున్న ఎండల నుంచి ఉప శమనం పొందేందుకు చిన్నారులు వేసవి సెలవుల్లో భాగంగా వ్యవసాయ పొలాల్లో ఉండే నేలబావులు, గ్రామాల్లో ఉండే చెరువుల్లో ఈతకొట్టి స్నానాలు చేసేందుకు ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ మేరకు మండలంలోని ఎమ్మార్‌నగరం శివారులో ఉన్న వ్యవసాయ నేలబావిలో స్థానికంగా ఉన్న చిన్నారులు ఉల్లాసంగా ఈత కొడుతున్న సందర్భంలో సాక్షి కెమెరా క్లిక్ మనిపించింది. ఏది ఏమైనప్పటికీ తగు జాగ్రత్తల విషయంలో చిన్నారుల పట్ల తల్లిదండ్రులు బాధ్యతగా వ్యవహరించాలని ఇటీవల జరుగుతున్న ఘటనల దృష్ట్యా పలువురు కోరుతున్నారు.

వధూవరులకు ఆశీర్వాదం



వధూవరులను ఆశీర్వదిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర

సాలూరు: మండలంలో కె.కరకవలస గ్రామంలో నిర్వహించిన ఏఎస్సై నందేల గంగులు కుమారుడి వివాహ వేడుకలో మాజీ డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వధూవరులను ఆయన ఆశీర్వదించారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యదర్శి దండి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

గులాబీలు కావండోయ్..!



తొక్కుడువలసలో విరబూసిన కాగితపు పూలమొక్క

పార్వతీపురం రూరల్: మండు వేసవిలో మోడు బారిన చెట్లు, పూత దశలోనే వాడిపోయి రాలిపోయిన పూలను, చెట్లను చూస్తుంటాం. కానీ కాగితం పూలమొక్కలు మండుటెండల్లో నిండుగా విరబూస్తూ అహ్లాదాన్ని పంచుతూ ప్రకృతి ప్రేమికులను ఆకర్షిస్తున్నాయి. పార్వతీపురం మండలంలోని తొక్కిడివలస గ్రామంలో ఓ మొక్క అందమైన గులాబీరంగు కాగితపు పూలను విరబూసింది.

ఆకస్మిక తనిఖీలు



తనిఖీల్లో భాగంగా ద్విచక్రవాహన దారువద్ద పత్రాలను పరిశీలిస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషి

పార్వతీపురం రూరల్: ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్వతీపురం మండలంలోని పలు ప్రధాన కూడళ్లు, సరిహద్దులు, అలాగే పట్టణ పరిధిలో ఉన్న రాష్ట్రీయ రహదారిపై శుక్రవారం వాహన తనిఖీలు నిర్వహించినట్లు పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టిసారించి ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నట్లు తెలిపారు. నాకాబందీ కార్యక్రమంలో భాగంగా జిల్లా ఉన్నతాధికారుల ఆదేశాలతో ఎప్పటి కప్పుడు ఏటీబీలో గుర్తించిన పలు కూడళ్లలోను, మండల పరిధిలో ఉన్న హోటల్స్, రైల్వేస్టేషన్ వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఎంపీటీసీల గౌరవంలో గారడీ

- 37 నెలలకు చెల్లింపులు జరగాలి
- 27 నెలలకు ఖాతాల్లో జమ

బలిజిపేట:

మండలంలోని ఎంపీటీసీల గౌరవ వేతనాల చెల్లింపుల్లో తేడాలు కనిపిస్తున్నాయనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎంపీటీసీలుగా పదవి చేపట్టిన నాటినుంచి నేటికి 27నెలలకు సంబంధించిన గౌరవ వేతనాలు మాత్రమే జమ అయ్యాయని మిగిలినవి నేటివరకు బకాయిలు ఉన్నాయని సభ్యులు చెబుతున్నారు. మండల పరిషత్ సభ్యులకు ప్రభుత్వం నెలకు రూ.3వేలు గౌరవ వేతనం చెల్లిస్తుంది. ఈ వేతనాల చెల్లింపులు ప్రతినెల కాకపోవడంతో లెక్కల్లో తేడాలు కనిపిస్తున్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. కార్యాలయం లెక్కల ప్రకారం నేటికి 37నెలలకు సంబంధించిన చెల్లింపులు జరిగినట్లు కనిపిస్తోంది. దీంతో గౌరవ వేతనాల చెల్లింపులు ఏమయ్యాయనేది ప్రశ్నార్థకంగా మారింది. ఎంపీటీసీ సభ్యులు సెప్టెంబరు 19, 2021న పదవులు చేపట్టారు. అయితే దానికి సంబంధించి అక్టోబరు, 2021నుంచి అక్టోబరు, 2024వరకు లెక్కచూస్తే 37నెలలకు సంబంధించి వారికి గౌరవ వేతనాలు అందాల్సి ఉంది. ఇవికాక సెప్టెంబరు, 2021లో 19వ తేదీ నుంచి నెలాఖరువరకు కూడా గౌరవ వేతనం అందాల్సి ఉంది. అయితే ఎంపీటీసీ సభ్యులకు మొదటి విడతలో 7నెలలు, 2వ విడతలో 9, మూడవ విడతలో 11నెలలకు మాత్రమే గౌరవ వేతనాలు జమ అయినట్లు చెబుతున్నారు. అంటే 27నెలలకు మాత్రమే వేతనాలు జమ అయ్యాయని తెలిపారు. కార్యాలయం లెక్కల ప్రకారం 2021లో సెప్టెంబరు నెలలో మిగులు రోజులకు చెల్లింపు జరిగినట్లు ఉందని, ఆ తరువాత నుంచి అక్టోబరు, 2021నుంచి ఏప్రిల్, 2022వరకు 7నెలలకు, మే, 2022నుంచి మార్చి, 2023వరకు 11నెలలకు, ఏప్రిల్, 2023నుంచి నవంబరు, 2023వరకు 8నెలలకు, డిసెంబర్ 2023నుంచి అక్టోబరు, 2024వరకు 11నెలలకు సంబంధించి 37నెలల గౌరవ వేతనాలు చెల్లింపులు జరిగినట్లు, నవంబరు, 2024నుంచి ఫిబ్రవరి, 2025వరకు 4నెలలకు బిల్లు పెట్టినట్లు సమాచారం. అయితే కూటమి ప్రభుత్వం వచ్చిన తరువాత బిల్లుల బకాయిలు ఉన్నాయని వాటిని వెంటనే చెల్లించాలని సభ్యులు కోరుతున్నారు. గౌరవ వేతనాల చెల్లింపులలో జాప్యంతో పాటు మండల పరిషత్ సభ్యులకు కనీస గౌరవం దక్కడం లేదని వాపోతున్నారు. గతంలో మండల పరిషత్ సభ్యుల తీర్మానాల ప్రకారం పనులు నిర్వహించేవారని, కూటమి ప్రభుత్వం దానికి స్వస్తి పలికిందని సభ్యులు వాపోతున్నారు. అందుకు తార్కాణం ఇటీవల బీసీ కార్పొరేషన్ మంజూరు చేసిన యూనిట్లకు నిర్వహించిన ఇంటర్వ్యూలలో స్పష్టంగా కనిపిస్తోందన్నారు. గత ప్రభుత్వం హయాంలో ఇటువంటి యూనిట్ల ఎంపికకు ఎంపీపీ, సభ్యులకు గౌరవం దక్కేదని, కూటమి ప్రభుత్వంలో దారుణంగా ఉందని ఆందోళన చెందుతున్నారు.



ఎంపీడీఓ కార్యాలయం

ఖాతాల్లో ఈ విధంగానే జమ

మండల పరిషత్ సభ్యులకు రావాల్సిన గౌరవ వేతనాలు ఇప్పటివరకు మూడు విడతల్లో 27నెలలకు మాత్రమే ఖాతాల్లో జమ అయ్యాయి. మిగిలినవి బకాయిలు ఉన్నాయి. వెంటనే వాటిని చెల్లించాలని కోరుతున్నాం.

సాంబమూర్తి, ఎంపీటీసీ, పెద్దింపేట

కార్యాలయం లెక్కల ప్రకారం చెల్లింపులు జరిగాయి

మండల పరిషత్ సభ్యుల గౌరవవేతనం చెల్లింపులు రికార్డులలో నమోదై ఉన్నాయి. ఆ ప్రకారం చెల్లింపులు జరిగాయి. ఇంకా 4నెలలకు జమ కావాల్సి ఉండగా ఇటీవలే బిల్లు పెట్టాం.

నగేష్, ఎంపీడీఓ, బలిజిపేట

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తిచేయాలి

- ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇళ్లను లబ్ధిదారులు త్వరగా పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి సూచించారు. ఈ మేరకు శుక్రవారం పార్వతీపురం మండలంలోని పెదబొండపల్లి పంచాయతీ పరిధిలో నిర్వహించిన మన ఇల్లు–మన గౌరవం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా లబ్ధిదారులతో మాట్లాడి సమాజంలో సొంతిల్లు కలిగి ఉండడం గౌరవ ప్రదమని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను ప్రారంభించి పూర్తి చేయాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం నుంచి రుణ సహాయం పెరగడంతో మరింత ఉత్సాహంగా లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. పరిశీలనలో ఆమెతోపాటు ఎంపీడీఓ జి.రమేష్, ఈఓపీఆర్‌డీ జీవీ రమణమూర్తి, హౌసింగ్‌శాఖ అధికారులు తదితరులున్నారు.



అంగన్వాడీ కేంద్రంలో కిశోరీ వికాసం కార్యక్రమంపై మాట్లాడుతున్న మండల ప్రత్యేకాధికారి ఎం.సుధారాణి

కిశోరీ బాలికలపై ప్రత్యేక శ్రద్ధ

ఈ పర్యటనలో భాగంగా మండల ప్రత్యేకాధికారి ఎం. సుధారాణి అంగన్వాడీ కేంద్రాన్ని సందర్శించి స్థానికంగా ఉన్న గ్రామస్తులతో మాట్లాడుతూ కిశోరీ బాలికలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని వారి శరీరంలో వచ్చే మార్పులతో పాటు నెలవారీ వచ్చే రుతుస్రావంపై బాలికలకు అవగాహన ఉండాలని, అప్పుడే వారి ఆరోగ్య పరిస్థితి, శారీరక మార్పులపై ప్రత్యేక శ్రద్ధ ఉంటుందన్నారు. వేసవిలో ప్రభుత్వం ద్వారా నిర్వహించే కిశోరీ వికాసం కార్యక్రమంపై తల్లిదండ్రులతో చర్చించారు.

ఆర్టీసీలో పదోన్నతులకు ప్రభుత్వం అనుమతి ఇవ్వాలి

సాలూరు: ఆర్టీసీలో పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు ప్రభుత్వం వెంటనే అనుమతులు ఇవ్వాలని ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు వలిశెట్టి దామోదరరావు అన్నారు. ఈ మేరకు శుక్రవారం పట్టణంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, పెండింగ్‌లో ఉన్న పదోన్నతులకు ప్రభుత్వం అనుమతులు ఇస్తే, అసిస్టెంట్ మెకానిక్ నుంచి ఎగ్జిక్యూటివ్ వరకు సుమారు 3వేల మందికి పదోన్నతులు వచ్చి న్యాయం జరుగుతుందన్నారు. ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను చెల్లించాలని, కొత్త బస్సులను కొనుగోలు చేసి సిబ్బందిని రిక్రూట్ చేయాలని డిమాండ్ చేశారు. ఆర్టీసీ నేషనల్ మజ్దూర్ యూనియన్‌లో ఉన్న పలువురు నాయకులు, కార్యకర్తలు ఈయూలో చేరారు.

వేతనదారుల సమస్యలు పరిష్కరించాలి

పార్వతీపురం రూరల్: ఉపాధి హామీ వేతన దారుల సమస్యలు పరిష్కరించాని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు శుక్రవారం వారు మండలంలోని నర్సిపురం గ్రామంలో ఉపాధిహామీ పనులు జరుగుతున్న ప్రాంతాలను పరిశీలించి వేతనదారులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉపాధిహామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేలా వ్యవహరిస్తున్నాయని మండిపడ్డారు. చట్టప్రకారం 15రోజులకోసారి వేతనాలు చెల్లించాల్సి ఉన్నప్పటికీ బకాయిలు ఉంచడం దారుణమన్నారు. వేతనదారులకు వేసవి ఎద్దడి ఉన్నా కనీస స్థాయిలో పనిచేసే ప్రదేశంలో మజ్జిగ, టెంటు, మంచినీరు వంటి సౌకర్యాలు కల్పించకపోవడంపట్ల అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎన్నో ఏళ్ల క్రితం ఇచ్చిన పనిముట్లతోనే నేటికి పనిచేయాల్సిన పరిస్థితి నెలకొందన్నారు. వేతనదారులకు ఇవ్వాల్సిన రవాణా చార్జీలు సైతం నేటికి అందని పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు బొత్స మోహనరావు, గరుగుబిల్లి సూరయ్య తదితరులు పాల్గొన్నారు.



వేతనదారుల సమక్షంలో సమస్యలపై మాట్లాడుతున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

అప్రెంటిస్‌కు దరఖాస్తుల ఆహ్వానం

సాలూరు: ఐటీఐ అప్రెంటిస్‌కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సాలూరు ఐటీఐ కళాశాల ప్లేస్‌మెంట్ అధికారి శ్రీనివాసరావు ఓ ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, విజయనగరం, విశాఖపట్నంలోని ప్రముఖ కంపెనీలలో అప్రెంటిస్ ఖాళీలున్నాయని పేర్కొన్నారు. అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు నేరుగా కళాశాలలో స్వీకరిస్తున్నామన్నారు. అప్రెంటిస్ పూర్తయిన వారు ప్లేస్‌మెంట్ కోసం రావచ్చని తెలిపారు. స్టైపెండ్ రూ.12 వేల నుంచి రూ.15 వేలు ఇవ్వనున్నట్లు చెప్పారు. సర్టిఫికెట్స్ ఒరిజినల్స్, జిరాక్స్‌లతో కళాశాలకు రావాలని సూచించారు.

ట్రుటిలో తప్పిన ప్రమాదం

- ఎంపీడీఓ కార్యాలయంలో ఊడిన పెచ్చులు



ఊడిన పెచ్చులను పరిశీలిస్తున్న జెడ్పీటీసీ రవికుమార్, ఎంపీడీఓ నగేష్

బలిజిపేట: స్థానిక ఎంపీడీఓ ఎంపీడీఓ కార్యాలయంలో పనివేళలో భవనంలోని లోపలి భాగంలో శ్లాబ్ పెచ్చులూడి పడిపోయాయి. అయితే అదృష్టవశాత్తు అక్కడే ఉన్న సిబ్బందికి త్రుటిలో ప్రమాదం తప్పింది. ఉదయం 12గంటల సమయంలో కార్యాలయంలో సిబ్బంది అటుఇటు తిరుగుతున్న సమయంలో లోపలి భాగంలోని శ్లాబ్ పెచ్చులూడి పడిపోయాయి. ఆ సమయంలో సిబ్బంది అటుఇటు తిరుగుతున్నా ఎవరికీ ప్రమాదం సంభవించలేదు. అదేసమయంలో కార్యాలయంలో ఉన్న జెడ్పీటీసీ రవికుమార్ ఈ విషయాన్ని పరిశీలించి తగు చర్యలు చేపట్టాలని ఎంపీడీఓ నగేష్‌కు సూచించారు.

డయల్ యువర్ డీఎంకు మిశ్రమ స్పందన

సాలూరు: పట్టణంలోని ఆర్టీసీ డిపో వద్ద శుక్రవారం నిర్వహించిన డయ ల్‌యువర్ ఆర్టీసీ డీఎం కార్యక్రమానికి మిశ్రమ స్పందన లభించింది. ఆర్టీసీ డీఎం మూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి పలువురు ప్రజలు, ప్రయాణికులు ఫోన్ చేసి ఆర్టీసీ సర్వీసులపై మాట్లాడారు. ముఖ్యంగా చీపురుపల్లి నుంచి రామభద్రపురం మీదుగా పార్వతీపురం బస్సు సర్వీసు నడపాలి. ఉద్యోగస్తులకు వెళ్లే సమయంలో సాలూరు–పార్వతీపురం మధ్య బస్సులు పెంచాలి. విజయవాడ బస్సు పునరుద్ధరించాలి. సాలూరు–విజయనగరం బస్సులు పెంచాలని కోరారు. ఈ అంశాలను నమోదు చేసుకుని, శాఖాపరంగా పరిష్కరించడానికి కృషిచేస్తామని డీఎం తెలిపారు.

కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు



గృహనిర్మాణ లబ్ధిదారులతో చర్చిస్తున్న అధికారులు

- మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి

సీతానగరం: మండలంలోని కాలనీల్లో మౌలిక సదుపాయాల కల్పనకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని అర్ధాంతరంగా నిలిచిపోయిన గృహాలు లబ్ధిదారులకు ప్రకటించిన అదనపు ఆర్థికసహాయంతో పూర్తి చేయాలని మండల ప్రత్యేకాధికారి రాజేశ్వరి అన్నారు. ఈ మేరకు మండలంలోని గుచ్చిమి హౌసింగ్ కాలనీలో శుక్రవారం ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.కుమారవర్మ, ఇతరశాఖల అధికారులతో కలిసి గృహనిర్మాణాలు జరిగిప హౌసింగ్ కాలనీలో పర్యటించారు. ఈ సందర్భంగా అధికారులు కాలనీలో వసరులు, పూర్తయిన గృహాలు, అర్ధాంతరంగా నిలిచిపోయిన గృహాల లబ్ధిదారులతో చర్చించారు. లబ్ధిదారులకు మంజూరు చేసే అదనపు ఆర్థిక సహాయంతో మే నెలాఖరు నాటికి గృహాలను పూర్తి చేయాలని, పూర్తి చేసిన వాటికి బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకుంటామన్నారు. హౌసింగ్ ఏఈ జానకీరాం ఆధ్వర్యంలో కాలనీల్లో మౌలిక సదుపాయాలు కల్పించనున్నట్లు తెలియ జేశారు. ప్రకటించిన అదనపు ఆర్థిక సాయం వివరాలపై కాలనీలోని బీసీ, ఎస్సీ లబ్ధిదారులకు గృహ నిర్మాణ శాఖ సిబ్బంది అవగాహన కల్పిస్తున్నారని పేర్కొన్నారు. అనంతరం కాలనీలో రోడ్లు, మౌలిక వసతులను పరిశీలించారు. అలాగే కాలనీలో మంచినీరు సరఫరాచేస్తున్న వాటర్‌ట్యాంక్‌ను అంగన్వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కార్యాలయం సీనియర్ సహాయకుడు సన్యాసిరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ పూర్ణిమ, గృహనిర్మాణసంస్థ సిబ్బంది, ఇంజినీరింగ్ సహాయకులు, వీఆర్వో, పంచాయతీ కార్యదర్శి అంగన్వడి సిబ్బంది పాల్గొన్నారు.

గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు

సీతానగరం: మండలంలో తొలకరిలో వ్యాధుల నివారణకు ముందు జాగ్రత్తచర్యగా గొర్రెలు, మేకలకు వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నామని పశుసంవర్ధక శాఖ ఎ.డి డాక్టర్ సీహెచ్ దీనకుమార్ అన్నారు. ఈ మేరకు సీతానగరంలోని పశువైద్య కార్యాలయంలో ఆయన శుక్రవారం మాట్లాడుతూ తొలకరిలో గొర్రెలు, మేకలు వివిధ రకాల వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందని, అవి వ్యాధుల బారిన పడకుండా ఉండేందుకు గ్రామాల్లో గొర్రెలు మేకల కాపరులు, పెంపకం దారుల కొట్టాల్లో ఉన్న వాటికి తమ సిబ్బంది వ్యాధి నిరోధక టీకాలు వేయనున్నారని చెప్పారు. ఈ నేపథ్యంలో లక్ష్మీపురంలో పశుసంవర్ధకశాఖ సహాయకురాలు బి.పద్మావతి, సిబ్బందితో గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలు వేశారన్నారు. ఈ అవకాశాన్ని గొర్రెలు, మేకల పెంపకందారులు వినియోగించుకోవాలని కోరారు.



లక్ష్మీపురంలో గొర్రెలకు వ్యాధినిరోధక టీకాలు వేస్తున్న వీహెచ్‌ఏ బి.పద్మావతి

మీడియా స్వేచ్ఛను కాపాడండి



డీటీకి వినతిపత్రం అందిస్తున్న ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులు

సాలూరు: సాక్షి ఎడిటర్‌పై దాడి మీడియా స్వేచ్ఛను హరించడమే నని, మీడియా స్వేచ్ఛను కాపాడాలని సాలూరు నియోజకవర్గంలోని పలువురు ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా పాత్రికేయులు అభిప్రాయపడ్డారు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసముంటున్న అపార్ట్‌మెంట్‌లో పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తనిఖీలు చేయడాన్ని వారు తీవ్రంగా ఖండించారు.జర్నలిస్టు సంఘాల ఆధ్వర్యంలో సాలూరు తహసీల్దార్ కార్యాలయం వద్ద నల్లరిబ్బన్లు ధరించి శుక్రవారం నిరసన తెలియజేశారు. మీడియాకు రక్షణ కల్పించాలని కోరారు. ఈ మేరకు సీఎస్‌డీటీ రంగారావుకు వినతిపత్రం అందజేశారు.

మీడియా స్వేచ్ఛను అడ్డుకోవడం తగదు



మీడియా స్వేచ్ఛను అడ్డుకోరాదు. ప్రజల తరఫున మీడియా పనిచేస్తుంది. మీడియాలో పనిచేస్తున్న వ్యక్తులపై దాడులు, దౌర్జన్యాలు సరికాదు. సాక్షి ఎడిటర్ ధనుంజయరెడ్డి నివాసముంటున్న ఇంటిలో పోలీసులు ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా తనిఖీలు చేయడాన్ని ఖండిస్తున్నాం.

–రాపాక కూర్మారావు, ఏపీడబ్ల్యూజే ఎలక్ట్రానిక్ మీడియా స్టేట్ కౌన్సిల్ మెంబర్

పత్రికా స్వేచ్ఛను హరించినట్లే



ఓ పత్రిక ఎడిటర్ నివాసముంటున్న ఇంటిని ఎటువంటి నోటీసులు ఇవ్వకుండా పోలీసులు సోదాచేయడం చాలా బాధాకరం.ఇది పత్రికా స్వేచ్ఛను హరించినట్లే అవుతుంది. ఓ ప్రముఖ పత్రిక ఎడిటర్ పరిస్థితే అలా ఉంటే క్షేత్రస్థాయిలో పాత్రికేయుల పరిస్థితి ఏ విధంగా ఉంటుందో అనడానికి ఇది నిదర్శనం. ఏ ప్రభుత్వాలైనా జర్నలిస్టులపై దాడులు చేయడం చాలా హేయమైన చర్య. ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా అందరం ఐక్యంగా పోరాడాలి.

– బాలి విశ్వేశ్వరరావు, సీనియర్ పాత్రికేయుడు, సాలూరు

మీడియాను అణచివేసే కుట్ర



సాక్షి ఎడిటర్‌పై పోలీసుల తీరు సరైంది కాదు. ఇది మీడియాను అణిచివేసే కుట్రలో భాగంగా కనిపిస్తోంది. మీడియాకు రక్షణ కల్పించాలని కోరాల్సిన దుస్థితి రావడం సిగ్గుచేటు. ఇకముందు ఇటువంటివి పునరావృతం కాకుండా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– జి.పోలినాయుడు, ఏపీడబ్ల్యూజేఎఫ్ కార్యదర్శి, సాలూరు

తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే ఖబడ్దార్..!

పార్వతీపురం టౌన్: తూనికలు, కొలతల్లో తేడాలు వస్తే కఠినంగా వ్యవహరిస్తామని లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రత్నరాజు హెచ్చరించారు. లీగల్ మెట్రాలజీ వారోత్సవాల్లో భాగంగా శుక్రవారం పార్వతీపురం పట్టణంలోని పలు దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. అనంతరం సూపర్‌మార్కెట్లలో తనిఖీలు నిర్వహించి వినియోగదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వినియోగదారులు వస్తువులను కొనుగోలు చేసేటప్పుడు ఎమ్మార్పీ కన్నా అధిక ధరలకు విక్రయిస్తే తక్షణమే ఫిర్యాదు చేయాలని సూచించారు. దుకాణాల్లో తూనికలు, కొలతల విషయంలో తేడా ఉన్నట్లు అనుమానం వచ్చినట్‌లైతే తక్షణమే తమకు ఫిర్యాదుచేయాలని పిలుపునిచ్చారు. దుకాణదారులు తూకాలకు సీల్ తప్పనిసరిగా వేయించాలని, లేనట్లైతే అటువంటి దుకాణదారులపై ప్రత్యేక నిఘా ఉంచి కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లీగల్ మెట్రాలజీ సిబ్బంది పాల్గొన్నారు.



మోర్ సూపర్ మార్కెట్‌లో అవగాహన కల్పిస్తున్న లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ రత్నరాజు

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

బలిజిపేట: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని బలిజిపేట సీడీపీఓ సులేఖ తెలిపారు. వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా బాల్యవివాహాల వల్ల కలిగే దుష్ఫలితాలపై బలిజిపేటలో అవగాహన నిర్వహించి ర్యాలీ చేశారు. మండల కేంద్రంలోని నాల్గవ అంగన్వాడీ కేంద్రంలో కిశోరీ బాలికలకు అవగాహన కల్పించారు. బాల్య వివాహం అంటే ఏమిటి? వివాహం ఎన్ని సంవత్సరాలకు చేసుకోవాలి? బాల్య వివాహం వలన కలిగే దుష్ఫలితాలపై తెలియజేశారు. బాల్య వివాహాలు చేసుకోవడం చట్టరీత్యా నేరమంటూ బాల్య వివాహాల నిరోధక చట్టంపై అవగాహన కల్పించారు. వాటికి సంబంధించిన వీడియోలను ప్రదర్శించారు. బాల్య వివాహాలను ప్రోత్సహించవద్దని, బాల్య వివాహాలు చేసే వారిపై కఠిన చర్యలు ఉంటాయని, ఎవరైనా బాల్య వివాహాలు చేస్తే తెలియపరచాలనే నినాదాలతో గ్రామంలో ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ పద్మ, అంగన్వాడీ కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.



బలిజిపేటలో ర్యాలీ చేస్తున్న అంగన్వాడీలు, కిశోరీ బాలికలు

కొనసాగుతున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె

పార్వతీపురం:

ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికుల సమ్మె రెండో రోజుకూడా కొనసాగింది. ఏపీఎస్‌ఆర్‌టీసీ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్, సీఐటీయూ నాయకుల ఆధ్వర్యంలో శుక్రవారం గ్యారేజీ బయట కార్మికులు ఆందోళనచేసి నిరసన వ్యక్తం చేశారు. సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వై.మన్మథరావు, బి.సూరిబాబు, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ అండ్ ఎంప్లాయిస్ జేఏసీ కన్వీనర్ బీవీ రమణలు ఈ సందర్భంగా మాట్లాడుతూ తక్కువ వేతనం ఇచ్చి కార్మికులతో ఆర్టీసీ యాజమాన్యం పనిచేయించుకుంటోందని, ఆ వేతనంకూడా కాంట్రాక్టర్లు పూర్తిగా కార్మికులకు చెల్లించడం లేదన్నారు. దీంతో కాంట్రాక్ట్ కార్మికులు అన్యాయానికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. పండగ, పర్వదినాలలో కార్మికులకు సెలవులు మంజూరు చేయాలని కోరారు. కార్మికుల సమస్యల పట్ల సానుకూలంగా స్పందించి ప్రజా రవాణాధికారి సమక్షంలో జరిగిన ఒప్పందాన్ని అమలుచేయాలని, లేదంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయుకులు భాస్కరరావు, కృష్ణకాంత వెంకటేష్, గణపతి తదితరులు పాల్గొన్నారు.



గ్యారేజీ ఆవరణలో ఆందోళన చేస్తున్న సీఐటీయూ నాయకులు, కాంట్రాక్ట్ వర్కర్స్